

## 'మహేష్'కి కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఆహ్వానం
# నేడు అవార్డు ప్రదానం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ఈనెల 3 నుండి 9వ తేదీల్లో జరిగే 'స్కూల్ లీడర్షిప్ ప్రోగ్రాం అవార్డు ఉత్సవానికి భారతదేశం నుంచి 20 పాఠశాలల నిర్వాహకులకు ఆహ్వానం అందగా ఆంధ్రప్రదేశ్ నుండి క్యాంఫోర్డ్ విద్యాసంస్థల అధినేత సిఆర్.మహేష్‌కి అవకాశం లభించింది. చిత్తూరు జిల్లా చిత్తూరు పట్టణంలోని క్యాంఫోర్డ్ విద్యాసంస్థలకు 1991 నుంచి సిఆర్.మహేష్ సారథ్యం వహిస్తున్నారు. 2015 నుంచి క్యాంఫోర్డ్ పాఠశాల డైరెక్టర్‌గా బాధ్యత వహిస్తున్న వీరి కుమార్తె సి.మేధినిరెడ్డి ఈప్రతిష్టాత్మక అవార్డును ఈనెల 8న లండన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి అందుకుంటున్నారు. ఈ వేడుకను కేంబ్రిడ్జి ఎడ్యుకేషన్ ల్యాబ్ కామ్సిస్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.


అవార్డు అందుకోనున్న మహేష్ కుమార్తె మేదిని రెడ్డి

# చంద్రయాన్-3 ప్రయోగానికి సర్వం సిద్ధం

**ప్రజాశక్తి-సూళ్లూరుపేట**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో సారి ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ ప్రయోగానికి సిద్ధం అయ్యింది. జూలై నెల 14 న చంద్రయాన్ -3 ఉపగ్రహ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లను శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. గత వైఫల్యాలను సరిచేసి సరికొత్త సాంకేతిక పరికరాలతో తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుండి చంద్రయాన్ ప్రయోగం జరపనుంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఇస్రో ఎల్వీఎం మార్క్-3 రాకెట్ ద్వారా చంద్రయాన్ -3 ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. శ్రీహరికోట లోని రెండవ ప్రయోగ వేదిక నుండి మధ్యాహ్నం 2 గంటల 35 నిమిషాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఈ ప్రయోగం జరుగుతుంది. చంద్రుని పై దాగి ఉన్న రహస్యాలను శోధించడానికి ప్రధానంగా ఈ ప్రయోగాన్ని ఇస్రో నిర్వహిస్తోంది. చంద్రుని పై ఎలాంటి వాతావరణం ఉంది? అక్కడ వాతావరణ పరిస్థితుల పైన అధ్యయనం చేయడానికి భవిష్యత్‌లో మానవ సహిత చంద్రయాన్ ప్రయాణానికి అవసరమైన పరిశోధనల కోసం ఈ చంద్రయాన్ -3 ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రయోగం జరిగిన 42 రోజుల తరువాత ఉపగ్రహం లోని ల్యాండర్ చంద్రుని పై దిగే విధంగా ఉపగ్రహాన్ని రూపకల్పన చేసి ఉన్నారు. అంటే భూమి నుండి



42 రోజుల పాటు ఉపగ్రహం చంద్రుని వైపుకు ప్రయాణం చేస్తుంది. 2008 లో ఇస్రో ప్రయోగించిన మొదటి చంద్రయాన్ -1 ప్రయోగం ద్వారా పంపిన ఆర్బిటర్ ద్వారా చంద్రుని పై నీటి ఆనవాళ్లను ఇస్రో గుర్తించింది. అలాగే 2019 చేపట్టిన చంద్రయాన్ -2 ప్రయోగంలో ఆర్బిటర్ ద్వారా ఒక ల్యాండర్ ను, ఒక రోవర్ ను పంపింది. లాండింగ్ సమయంలో సంబంధాలు తెగిపోవడంతో అది కాస్త పాక్షిక విజయంగా మిగిలిపోయింది. అపజయాలు విజయాలకు సోపానాలుగా మలచుకుని ఇస్రో ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో చంద్రయాన్ -3 తయారు చేసి ప్రయోగానికి సిద్ధం చేసింది. ఇప్పటికే చంద్రుని పై అడుగు పెట్టి సత్తా చాటిన అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన చేరడానికి భారత్ చంద్రయాన్ -3 ప్రయోగ విజయం కోసం ఎదురుచూస్తోంది. ఈ ప్రయోగానికి సంబంధించిన విండో జులై 12 నుండి 19 వరకు అందుబాటులో ఉంటున్న నేపథ్యం లో 14 వ తేదీన ప్రయోగానికి ముహూర్తం నిర్ణయించారు.

# అంగన్వాడీల 36 గంటల ధర్నాను జయప్రదం చేయండి


సిఐటియు ప్రాంతీయ సమావేశాల బహిరంగసభలో ప్రసంగిస్తున్న సిహెచ్ నర్సింగరావు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ / సూళ్లూరుపేట**

ఈనెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్‌ల వద్ద జరిగే 36 గంటల ధర్నాకు సిఐటియు సంఘీభావం ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు వెల్లడించారు. గూడూరు పట్టణంలోని జరుగుతున్న సిఐటియు ప్రాంతీయ సమావేశాలలో గురువారం సాయంత్రం జరిగిన భారీ బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి, కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న విధానాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేకతను మూటగట్టుకుని ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టారని అదానీ, అంబానీల రాజ్యం సాగుతోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి చెప్పిన దాన్ని తలాడించే ప్రభుత్వంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తయారయిందని, ఈ రెండింటి కార్మిక వ్యతిరేక విధానాల వల్లే తీవ్రమైన సమస్యలు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. అంగన్వాడీలు, మధ్యాహ్న భోజనం, ఆశ తదితర స్కీం వర్కర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గూడూరు రూరల్ అంగన్వాడీ అధ్యక్షురాలు ఇందిరావతి పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గూడూరు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం గోడ పత్రికలను విడుదల చేశారు. ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచాలన్నారు. సుప్రీం కోర్ట్ తీర్పు ను అనుసరించి గ్రాట్యుటీ తక్షణమే అమలు చేయాలన్నారు. మీని సెంటర్ లను మెయిన్ సెంటర్ లాగా మార్చాలన్నారు. ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలన్నారు. సర్వీస్‌లో ఉంటూ చనిపోయిన కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలన్నారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న డిఏ బిల్లులను చెల్లించాలని అదేవిధంగా వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. ఈనెల 10 వ తేదీ నుండి 36 గంటల పాటు తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నామని , డివిజన్ లోని అంగన్వాడీ కార్యకర్తలు , హెల్పర్స్ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభావతి , సాయమ్మ , లక్ష్మీ , అరుణ , ముని కుమారి , ఆసియా పాల్గొన్నారు.

## 10, 11 తేదీల్లో సిఐటియు సంఘీభావం



సూళ్లూరుపేట ప్రాజెక్టు కార్యదర్శి మేకల హైమావతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సిడిపిఒ శారదకు వినతిపత్రాన్ని సమర్పించారు.

## ఆగస్టు 9న 'క్విట్ మోదీ..సేవ్ ఇండియా' ఆందోళనలు

**తిరుపతి టౌన్ :** క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 9న 'క్విట్ మోడీ... సేవ్ ఇండియా' పేరుతో జరగనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పిలుపునిచ్చారు. ఈ మేరకు జులై 7న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్మికులందరూ పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ పేరుతో లక్షల కోట్ల ప్రజల ఆస్తులను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు ధారపోస్తోందని, ఇటువంటి పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం నుంచి దేశాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు.

# పోరాటాల స్ఫూర్తితో ఉద్యమ నిర్మాణం

## గూడూరులో సిఐటియు ప్రాంతీయ సమావేశాలు ప్రారంభం

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** పోరాటాల స్ఫూర్తితో సిఐటియు సంఘాన్ని విస్తరించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ చేపడతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఉద్ఘాటించారు. సంఘాన్ని బలోపేతం చేసే నేపథ్యంలో ప్రాంతీయ సమావేశాలు రెండు రోజుల పాటు గూడూరులో జరుగుతున్నట్లు చెప్పారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వందమంది ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. తొలిరోజు సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. సిఐటియు ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు 'ప్రజాతంత్ర పని విధానం', జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం క్షేత్రస్థాయి నిర్మాణం...క్షేత్రస్థాయి కృషి, మండల, గ్రామ, వార్డుల కమిటీల కృషి'పై వివరించారు. శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్.వరలక్ష్మి శ్రామిక మహిళల పోరాటాలను వివరించారు. ఈ ప్రాంతీయ సమావేశాల్లో గూడూరు సిఐటియు నాయకులు జోగి శివకుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సురేంద్ర, అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజనేయులు, రాష్ట్ర అంగనవాడి కోశాధికారి ఎస్. వాణిశ్రీ, గూడూరు అంగన్వాడి నాయకురాలు ప్రభావతి గూడూరు ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి బి.వి. రమణయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, వి.ఆర్.ఏ. జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, ఎలక్ట్రిసిటీ నాయకులు టి.వెంకటరామిరెడ్డి, బి.గోపీనాథ్, ఎస్. సురేష్, ఏ. ప్రసాద్ పాల్గొన్నారు.




## గ్రీవెన్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి


**జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు**

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం**



గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చే సమస్యలకు సంబంధించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జెడ్‌పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని తిమ్మోజీపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించాలని అన్నారు. అనంతరం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రోజువారీ స్పందన, గ్రీవెన్స్‌లను వెంటనే పరిష్కరించి, విధులను అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. అలాగే వైఎస్సార్ గృహనిర్మాణ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన జడ్పీ సీఈఓ


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈఓ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్‌లో గల చవటపల్లి వార్డు సచివాలయంను గురువారం జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయంలో డిస్ప్లే చేసిన సంక్షేమపథకాలు, అర్హులైన లబ్ధిదారుల జాబితాను పరిశీలించి అప్డేటెడ్ లిస్ట్‌ను వాల్ పోస్టర్‌లను డిస్ప్లే బోర్డులో వెంటనే పెట్టాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆన్లైన్, ఆఫ్‌లైన్ అటెండన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అటెండన్స్ రిజిస్టర్‌లో ఎంట్రీస్, మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో క్యాంపు వివరాలు వెంటనే నమోదు చేయాలని సూచించారు రోజు వారీ స్పందన, గ్రీవెన్స్ సమస్యలను వెంటనే పరిష్కరించి, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. వైస్సార్ గహనిర్మాణ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు.

## రూ. 20 లక్షలతో 4 ఆర్‌ఓ ప్లాంట్లు


స్థల పరిశీలన చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్

**ప్రజాశక్తి- పుంగనూరు:** పట్టణ ప్రజలకు పరిశుద్ధమైన నీరు అందించేందుకు నాలుగు ప్రాంతాలలో రూ.20లక్షలు ఖర్చు చేసి ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాష తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు పట్టణంలో పర్యటించి గురువారం స్థలాలను గుర్తించారు. ఈసందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపేట, కోనేటిపాళ్యం, ఏటిగడ్డ పాల్యం, ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో ఏర్పాటుకు ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు ఎంపీ మిథున్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లడం వెంటనే స్పందించి ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించడంతో స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వర్ఫ్ బోర్డు ఛైర్మన్ అమ్ము, 30 వార్డు కౌన్సిలర్ కొండవీటి నటరాజ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈ శివశంకర్ నాయుడు పాల్గొన్నారు.


# పోలీసుల ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు: ఎస్పీ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** పూతలపట్టు పోలీసులు క్రిష్ణగిరికి చెందిన కొంతమంది నిందితులను అరెస్టు చేసిన కేసుకు సంబంధించిన విషయాలను కొందరు అవాస్తవాలను ప్రచురితం చేయడం వలన పోలీసుల నైతిక విలువలు దెబ్బతింటున్న నేపథ్యంలో గురువారం జిల్లా ఎస్పి వై.రిషాంత్‌రెడ్డి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పూతలపట్టు మండలంలో వరుసగా జరిగిన పలు దొంగతనాలు నేపథ్యంలో చిత్తూరు జిల్లా చిత్తూరు డిఎస్పి కే.శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో కల్లూర్ సిఐ ఆశీర్వాదం, పూతలపట్టు ఎస్ఐ హరిప్రసాద్ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక పోలీస్ బందాలను ఏర్పాటు చేసి కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలలో పేరుమోసిన నిందితులపై నిఘాఉంచి చిత్తూరు జిల్లాలో జరిగిన దొంగతనాల విధానాలను బట్టి తమిళనాడులోని పలు జిల్లాలలో విచారించగా కొంతమంది ఎంఒ ఇలానే ఉండటంతో వారిపై నిఘా పెట్టినట్లు తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు 15.6.2023వ తేదీన చిత్తూరు పట్టణంలోని ఎస్‌విసిఇటి కాలేజీ వద్ద దొంగాతనాలలో ప్రధాన ముద్దయిలైన వైరు ముత్తు, అయ్యప్ప వారి అనుచరులను అరెస్ట్ చేసి రేమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ కేసుకు సంబంధించిన దొంగల ముఠాలో 6 మంది మహిళా ముద్దాయిల బంధువులకు సిపిఐ నేతలు, ఆ ఊరి పెద్దమనుషుల సమక్షంలో 41నోటీసు సర్వ్‌చేసి పూతలపట్టు ఎస్ఐ వారి బందం తమిళనాడులోని ఉతంగిరి స్టేషన్‌లో డిఎస్పికి అప్పగించి వచ్చారని తెలిపారు. అప్పగించిన మరుసటిరోజు వారు అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరగా అక్కడి రెవెన్యూ అధికారులు దొంగతనం కేసుకు సంబంధించి వారిని విచారణ చేయగా వారిని చిత్తూరు పోలీసులు విచారణ చేసారని అంతేకానీ పోలీసు వారు మమ్మలిని కొట్టడం లేదా తిట్టడం చేయలదని తెలిపారని పేర్కొన్నారు. అయితే రెండు రోజుల తరువాత కొంతమంది వారిని ప్రలోభపెట్టి చిత్తూరు పోలీసులపై ఫిర్యాదు చేయగా దాని ఆధారంగా చిత్తూరు జిల్లా పోలీసులపై కేసు నమోదు చేయడం తెలిసిందే అన్నారు. ఈకేసులో జిల్లా పోలీసుశాఖ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ దర్యాప్తు చేస్తోందని, నిందితులు ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి వెనకడుగు వేయకుండా పోలీసుశాఖలోని అధికారులు, సిబ్బందిపైనే కేసు నమోదు చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లను బదిలీ కూడా చేశామని తెలిపారు. అయితే కొన్నిపత్రికల్లో ఎలాంటి ఆధారాలులేని ఆరోపణలు చేయడం, పోలీసులు బేరసారాలు చేస్తున్నారని రాయడం, ఫిర్యాదుచేసిన వాళ్లకు డబ్బులు ముట్టచెప్పాలని చూస్తున్నారని ఇష్టప్రకారం బేస్‌లెస్ వార్తలు రాస్తున్నారని ఇలా రాసిన వార్తలను ఫిర్యాదుచేసిన నిందితులు చూసి, వారి మదిలోలేని ఆలోచనలు చిత్తూరులోని కొందరు మీడియా వ్యక్తులు సష్టించినట్లు అవుతోందన్నారు. ఏదైనా రాసేముందు వాస్తవాలు తెలుసుకుని, అనుమానం ఉన్నచోట అధికారుల వివరణ అడిగితే మంచిదని సూచించారు. అలాకాకుండా జిల్లా పోలీసుశాఖ ప్రతిష్ట దెబ్బతినేలా, దర్యాప్తును ప్రభావితం చేసేలా వార్తలు రాస్తే పోలీసుల నైతిక విలువలు దెబ్బ తీసే ప్రమాదం ఉందని అన్నారు. ఈదొంగాతనాలలో ప్రధాన నిందితుడైన వైరు ముత్తు పై పలు రాష్ట్రాలలో 40కి పైగా కేసులు ఉన్నాయన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

# రాజన్న బిడ్డను ఆదరించండి: ఎమ్మెల్సీ భరత్

**ప్రజాశక్తి- శాంతిపురం:** ప్రజాసంక్షేమమే తన ఊపిరిగా ప్రజారంజక పాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ కోరారు. గురువారం మండల పరిధిలోని కొలమడుగు గ్రామపంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మాట్లాడారు. 14 ఏళ్ళ సీఎంగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో సమస్యలను అపరిష్కృతంగా అలాగే ఉంచేసారని, ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకునే వారని ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుప్పం నియోజకవర్గంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రజల మన్ననను చూరగొంటోందని తెలిపారు. ఇప్పటివరకు సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరుస్తూ అండగా ఉన్న ప్రభుత్వం కేవలం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. కొలమడుగు గ్రామపంచాయతీలో గడపగడపకుమన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన బుక్లెట్లు వారికి అందించి వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. సర్పంచ్ ఎస్.మంగమ్మ మంజునాథ్, ఎంపీటీసీ రుక్మిణమ్మ దేవేంద్రన్‌లు ఎమ్మెల్సీని దుశ్యాలువలు కప్పి భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎస్.శ్రీనివాసులు, ఎంపీపీ కె.వసుంధర కోదండ రెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్‌ఎంపీపీలు టీవీ పట్టాభి, సీఎం సరస్వతి రమేష్, సింగిల్ విండో అధ్యక్షులు మునిరత్నం, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగభూషణమ్మ సుబ్బరాజు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వి.పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.


గ్రామాల్లో పర్యటిస్తూ లబ్దిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

# ప్రభుత్వ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష'

**డిప్యూటీ సీఎం నారాయణస్వామి**

**ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు**

అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష పథకం ఎంతగానో దోహదపడుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గురువారం మండలంలోని బాలగంగనపల్లి, ఆరవచేనుపల్లి, నాగూర్‌పల్లి, మేనాటంపల్లి, కుప్పనపల్లి, వేట్కూరుపల్లి, గడ్డంపల్లి గ్రామాలలో డిప్యూటీ సీఎం పర్యటించి, ఆయా కుటుంబసభ్యులతో మాట్లాడారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలన్నదే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, క్రిస్టియన్ మైనారిటీ మెంబర్ ప్రగతి, మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ చిన్నబ్బరెడ్డి, బాలగంగనపల్లి సర్పంచ్ శేఖర్, మాజీ మండల వైసీపీ కన్వీనర్ సురేందర్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ హరిబాబు, నేతలు వెంకటేష్ రెడ్డి, హేమశేఖర్ రాజు, ఆలీషేర్ ఖాన్, ఉపేంద్ర, గోవిందన్, బ్రహ్మతేజ, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాధన్, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ డీఈలు దయాకర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం చిరంజీవి, ఏవో వందన పాల్గొన్నారు.


గంగాధరనెల్లూరులో..

**నగరి:** గురువారం మండలంలోని నంబాకం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. 231 మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు, 232 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ముగ్గురికి ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్లు, 20 మందికి ఆధార్‌కార్డు అప్‌డేషన్, ఇద్దరికి మ్యుటేషన్ టైటిల్‌డీడ్, పాసుపుస్తకాలను మంత్రి అందించారు. ఆమె మాట్లాడుతూ ఒక్క నంబాకం సచివాలయంలోని నంబాకం, దేశూరు అగరం, కష్ణారామపురం గ్రామలలో మాత్రమే నాలుగేళ్లలో వివిధ పథకాలలో సంక్షేమం క్రింద రూ.30కోట్లు మేర ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఇదిగాక గడప గడపకు కార్యక్రమం ద్వారా రూ.20 లక్షల నిధులతో అభివద్ధి పనులు చేస్తున్నామన్నారు.


నగరిలో మంత్రి రోజా..

## ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**చిత్తూరుఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లు లబ్ధిదారులు ఇంటి వద్దకే అందుతున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో గురువారం 12, 22, 37వ వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 12వ వార్డు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందించడం వల్ల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వాలంటీర్లు, వార్డు కార్యదర్శులు సచివాలయం పరిధిలో ఇంటికి వెళ్లి వారి అవసరాలు తెలుసుకొని, వారికి అవసరమైన సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ఎన్.మధుబాబు, పి.గంగ, కె.నిర్మల, కో ఆప్షన్ నెంబర్ కె.కిరణ్ కుమార్, సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


చిత్తూరులో ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

**బంగారుపాళ్యం:** జగనన్న సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ బంగారు పాల్యం మండలం ఈచినేనివారిపల్లి, తుంబకుప్పం గ్రామాలలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం పై ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈచినేనివారిపల్లె సచివాలయ పరిధిలో ఈచనేరివారిపల్లి, తుంబకుప్పం గ్రామాలకు సంబంధించిన గ్రామస్తులకు ధ్రువీకరణ పత్రాల మంజూరు విధానంపై ప్రజలకు సమగ్రంగా వివరించారు. జేసి మాట్లాడుతూ తుంబకుప్పం గ్రామపరిధిలోని తుంబకుప్పం, పెరుమాళ్ళపల్లి గ్రామాలకు సంబంధించి జూన్ 29, 30 తేదీలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఎల్‌డిఓ రవికుమార్, తహశీల్దారు బెన్‌రాజ్, చిత్తూరు ఎంపిడిఓ మధుసూదన రెడ్డి పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో జెసి

## డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు





**ప్రజాశక్తి- సోమల:** మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఎంపిపి ఈశ్వరయ్య, ఎస్ నడింపల్లి సర్పంచ్ వెంకటరమణ, కందూరు సర్పంచ్ బాష మసూద్‌లు 36మంది డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇదివరకే 80మందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేయడం జరిగిందని మళ్లీ 36మందిని ఎంపిక చేసి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి ఈశ్వరయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు నాగేశ్వరరావు, అమాస మోహన్, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

## రామకుప్పం ఎస్సైపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాశక్తి- కుప్పం:** రామకుప్పం ఎస్సైపై ఎస్సి,ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టి సస్పెండ్ అయ్యేంతవరకు పోరటం ఆపబోమని దళిత, గిరిజన సంఘాలు పిలుపునిచ్చాయి. వెంటనే అధికారులు స్పందించి ఎస్సైను సస్పెండ్ చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధతం చేస్తామని వారు హెచ్చరించారు. కుప్పం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత గిరిజన సంఘం, జనసేన సైన్యం ఆధ్వర్యంలో జయశంకర్ ఉమాదేవి దంపతులతో రిలే నిరాహార దీక్షను నిర్వహించారు. గురువారం రెండో రోజు కొనసాగింది. వారు మాట్లాడుతూ దళితుల జోలికి వస్తే ఉపేక్షించేది లేదని, దళిత దంపతుల పట్ల దురుసుగా ప్రవర్తించి కులం పేరుతో దూషించిన రామకుప్పం ఎస్ఐ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అతన్ని సర్వీస్ నుండి రిమూవ్ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ నరేష్, ప్రకాష్, వేణుగోపాల్, బాలాజీ, పవన్, మునెప్ప, శివశంకర్, మంజునాథ్, హంసగిరి, విజయ్, చరణ్, అమీర్, సురేష్ తదితరలు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాశక్తి- సోమల:** సదుం మండలంలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని, రెగ్యులర్ చేయాలని, జీతభత్యాలు పెంపుదల చేయాలంటూ ఇంకా పలు రకాల సమస్యలపై చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిబ్బంది ఎర్రాతివారిపల్లె గ్రామంలో తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చొరవ చూపాలని ద్వారకనాథ్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలపై ప్రభుత్వ దష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్కందపుష్కరిణిని శుభ్రం చేయండి



**ప్రజాశక్తి- కార్వేటినగరం:** ఆగస్ట్‌నెల 9, 10, 11వ తేదీన మూడు రోజుల పాటు శ్రీవల్లి దేవసేన ఆడికతిక ఉత్సవాలు జరుగుతుందని ఆలయ కమిటీ, గ్రామస్తులు టిటిడి ఆలయ ఏఈఓ పార్థసారథికి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కంద పుష్కారిణి పరిసరాలను త్వరగా శుభ్రం చేయాలని ఆలయ అధికారి సురేష్ బాబుకు తెలియజేశారు. కార్యక్రమంలో ధనశేఖర్ యాదవ్, దామోదరం, లోకేష్ బాబు,తదితరులు ఉన్నారు.

## 'అమ్మఒడి'ని సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాశక్తి- పలమనేరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమ్మఒడిని తల్లిదండ్రులు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి లీలారాణి తెలిపారు. గురువారం మండల విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో జడ్‌పిహెచ్‌ఎస్ పెంగరగుంటలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత మంజూరు కార్యక్రమం ఎంపీపీ రోజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అదేవిధంగా ఎంపీయూపీ పాఠశాలలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత విడుదల భాగంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకష్ణ, కౌన్సిలర్ మురళికష్ణ, వైసీపీ రూరల్ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, రాజారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని కమ్మనపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్‌లో మిగిలి ఉన్న సీట్లు భర్తీ శుక్రవారం నుండి పాఠశాలలో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ టెన్త్‌క్లాస్ సప్లమెంటరీలో పాస్ అయిన విద్యార్థులు ఈసదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో ఉన్న సీట్లలకు సంబంధించి హాస్టల్‌లో ఖాళీలు లేవని, డేస్కాలర్‌గా మాత్రమే అవకాశం ఉందని తెలిపారు.

# జగనన్న సురక్ష.. పేద ప్రజలందరికీ రక్ష










**ప్రజాశక్తి- వికోట:** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష పేద ప్రజలందరికీ రక్షగ నిలవాలని ఎంపీపీ యువరాజ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంను మండలంలోని అందరు ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎం.వినోద, తహశీల్దార్ చిట్టిబాబు, మండల విస్తరణ అధికారి ఎస్.నరేష్ పాల్గొన్నారు.

**రామకుప్పం:** బడుగు బలహీన వర్గాల పేదలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపిపి సుబ్రహ్మణ్యం, వైసిపి మండల కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బైపరెడ్లపల్లి, రాజుపేట గ్రామపంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ మురళి, ఎంపీడీవో రాధాకష్ణ, మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ ఆనంద్, నేతలు బాలమురుగన్, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

**పాలసముద్రం:** ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష వేదికలో ఉచితంగా పలు రకాల ధ్రువీకరణ పత్రాలు మండల ప్రత్యేక అధికారి మహబూబ్ బాషా అందజేశారు. గురువారం కావేరి రాజపురం గ్రామ సచివాలయ పరిధిలో వైస్‌ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అన్‌బలగం, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్ కుమార్, బాబు, ఢిల్లీప్రసాద్, ఐకెపి ఎపిఎం పరిధి మస్తాన్, ఎంఈఓ గిరిజ పాల్గొన్నారు.

**యాదమరి:** ప్రతిఒక్కరూ జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని యాదమరి తహశీల్దార్ హనుమంతు తెలిపారు. గురువారం మాధవరం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష పత్రాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరాజ్ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**సోమల:** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎంపీడీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సబిత, సచివాలయ సిబ్బంది ఇంటింటి ప్రచారం, సర్వే నిర్వహించారు. నంజంపేట గ్రామంలోని ప్రతి వీధిలోని గహాల వద్దకు వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల ప్రజలకు చేకూరిన లబ్ధి, 11రకాల ధ్రువపత్రాల మంజూరు తదితర అంశాల గురించి వారికి వివరించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ దినకర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

## 'చైతన్యయాత్ర' జయప్రదం చేయండి

**ప్రజాశక్తి- పుంగనూరు:** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీన చేపడుతున్న భవిష్యత్ గ్యారెంటీ చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ప్రముఖ సామాజికవేత్త తెలుగుదేశం పార్టీ నాయకులు సుహేల్‌బాష, గిరి పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చైతన్య యాత్రను పుంగనూరు పట్టణంలో నిర్వహిస్తారని చెప్పారు. ఈ యాత్రలో అధికార పార్టీ చేపడుతున్న ప్రజావ్యతిరేక పాలనను ప్రజలకు వివరిస్తూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు చెప్పడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు గ్యారెంటీ చైతన్యయాత్రను నియోజకవర్గం ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## నూతన 108 వాహనానికి పూజలు



**ప్రజాశక్తి- సోమల:** సదుం మండలానికి కేటాయించిన నూతన 108వాహనానికి సదుం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ అభివద్ధి కమిటీ చైర్మన్ కష్ణారెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా వైద్యంపై దష్టి సారించి ఆసుపత్రులలో నాడు -నేడు పనుల ద్వారా అభివద్ధి పనులను చేసి ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నారని ఇందులో భాగంగా 108 వాహనాన్ని అత్యవసర పరిస్థితులలో ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం మండలానికి కేటాయించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వైద్యులు గిరీషరెడ్డి, శిరీష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘనసన్మానం

**ప్రజాశక్తి- గంగవరం:** మండలంలోని మామడుగు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలిపై వెళ్లిన ఉపాధ్యాయులు అరుల్‌మణి, హరిప్రసాద్‌ను గురువారం హైస్కూల్, ప్రైమరీ ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు, సచివాలయం సిబ్బంది, సిఆర్‌పి వెంకటాచలపతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను దశ్శాలతో సత్కరించారు. వారు పాఠశాలకు సేవలందించి తమ విద్యార్థుల చదువులలో బాగా రాణించేలా విద్యాబుద్ధులు నేర్పారని కొనియాడారు.

## 'తరల్' పై ఉపాధ్యాయులకు శిక్షణ

**ప్రజాశక్తి- సోమల:** మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం తరల్ పై శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈఓ-2 శివరత్నమ్మ, రిసోర్స్ పర్సన్లు నిర్వహించారు. గురువారం కందూరు, పెద్ద ఉప్పరపల్లి క్లస్టర్ పరిధిలోని గణితం, తెలుగు సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న దానిపై మూడు, నాలుగు, ఐదు తరగతుల పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ అందజేశారు. రిసోర్స్ పర్సన్‌గా పథ్వి, ముని వ్యవహరించారు. ఈకార్యక్రమంలో సిఆర్పి సోమశేఖర్, 40 మంది పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజాశక్తి- యాదమరి:** మండలంలోని కాశిరాళ్ల కె.గొల్లపల్లె హైస్కూల్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. కాశిరాల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన రమేష్ బాబు, ఉపాధ్యాయులు త్రివేణి, పద్మ, నాగరత్నంలు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం లలిత మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో రుక్మిణి, ప్రసాద్, బంగారుపాళ్యం ఎంఈవో నాగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ గోపి, వైస్‌చైర్మన్ చిట్టెమ్మ, సర్పంచ్ రాధ మురళి, వైస్ సర్పంచ్ ఇలియాజ్, ఎంపిటిసి దుర్వాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆలయంలో శుభకార్యాల నిర్వహణకు అనుమతి

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధీనంలో ఉన్న స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో తిరుమల తరహాలో పలు శుభకార్యాల నిర్వాహణకు అనుమతిస్తున్నట్లు టీటీడీ ఏఈవో పార్థసారథి అన్నారు. గురువారం ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా అమలు చేసిన విధివిధానాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏఈవో మాట్లాడుతూ ఉభయదారులు ఆలయానికి సంబంధించిన పండుగలు, ఉత్సవాల్లో పాల్గొనే టీటీడీ కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందులో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఆలయానికి రూ.1000లు విరాళం ఇచ్చేవారికి 3 సంవత్సరాల పాటు ఏడాదికి 5 రోజులు అర్చన, హారతి, ఇచ్చి స్వామివారి ప్రసాదం ఇవ్వడం జరుగుతుందన్నారు. రూ.5 వేలు విరాళం ఇచ్చిన వారికి 5 సంవత్సరాల పాటు ఏడాదికి 30 రోజులు అర్చన, హారతి ఇచ్చి స్వామివారి ప్రసాదం బహుకరించడంతో పాటు ఒక్కసారి ఉత్తరీయం సత్కారం చేస్తారన్నారు. రూ.10వేలు విరాళం అందించిన దాతలకు 10ఏళ్ల పాటు నిత్యార్చన, ఏడారిలో దాతలు కోరిన 30రోజులు అర్చన, హారతీ, ఆశ్వరతనలు, ప్రసాదంతో పాటు పట్టుకాలువతో సత్కారం జరుగుతుందని తెలిపారు. ఆలయంలో నిచ్చితార్థములు, పెళ్లిళ్ల అన్నప్రసాన్న వంటి పలు శుభ కార్యాలు నిర్వహించకోవడానికి టీటీడీ అనుమతిస్తుందన్నారు. విందులు మాత్రం ఆలయంలో నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. ఆలయంలో త్వరలో ఉంజల్ సేవ కూడా ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆలయ అధికారి సురేష్ కుమార్, వేద పండితులు గోపాలచార్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

# లేగ దూడల పెంపకంతో రైతులకు అధిక ఆదాయం



**ప్రజాశక్తి- వి.కోట:** పేయ దూడల పెంపకం ద్వారా పాడి రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని ఎంపిపి యువరాజు తెలిపారు. మండల పరిధిలోని ముద్దరందొడ్డి పంచాయతీ విజి.తోపు గ్రామంలో గురువారం ఘనంగా లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్ పాల్గొని మాట్లాడుతూ దూడల సంరక్షణ గురించి పాడి రైతులకు అవగాహన కల్పించేందుకు పశువైద్యఅధికారులు సిబ్బంది అందుబాటులో ఉన్నారని రైతులు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. పేయిదూడల కత్రిమ గర్భధారణ కొరకు ఎద సూదులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవలని పశువైద్యాధికారులు తెలిపారు. అనంతరం దూడలకు నట్టాల నివారణ మందులను పంపిణీ చేశారు. వివిధ గ్రామాలను పోటీలో పాల్గొన్న మేలుజాతి దూడల కలిగిన రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు జయశ్రీ, సర్పంచ్ దామోదర్, వైస్‌సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సంపంగి రెడ్డి, హరీష్ కుమార్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

# ద్రవరూప ఎరువులపై రైతులకు అవగాహన




**ప్రజాశక్తి- యాదమరి:** ద్రవరూప ఎరువుల వాడకంపై రైతులకు యాదమరి వ్యవసాయ అధికారి చరిత అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని ముత్తరపల్లి గ్రామంలో ఇఫ్కోవారి సౌజన్యంతో ద్రవరూప ఎరువులైన నానో యూరియా, నానో డిఏపి మందులను క్షేత్రస్థాయిలో రైతులకు ఎలా పంట పొలాలకి పిచికారి చేయాలి. ఎంత మోతాదులో మందులను వాడాలనే దానిపైన గ్రామంలోని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. క్రిమిసంహారక మందులు పంటలకు వాడేటప్పుడు వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు పాటిస్తూ తగిన మోతాదులో వాడాలని సూచించారు. ప్రతిరైతు పంటలపై సస్యరక్షణ చర్యలు పాటిస్తూ పంటలను పండిస్తే అధిక దిగుబడి పొంద వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్కో ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్ వ్యవసాయ అధికారి చరిత, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీల ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి- పలమనేరు:** తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి ఆధ్వర్యంలో కళామందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించు జాతీయస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీ ఫలితాలను సంస్థ అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు గురువారం విడుదల చేశారు. వ్యాసరచన పోటీకి 170మంది వ్యాసాలు పంపగా 20మందిని బహుమతులకు ఎంపిక చేశామన్నారు. నిఖిల, జువైరియావో, శ్వేత, కతివెంకట్ హైదరాబాదుకు చెందిన సాయిహర్షిత్, అక్షిత్, మణురాజ్‌రెడ్డి, అక్షయరెడ్డి, సాయి ప్రజ్వత్, యాదమరికి చెందిన రిషిక, జాహ్నవి, గంగవరంకు చెందిన జశ్వంత్, గణేష్, సందేష్, చందు, తమశ్రీ, అర్హాన్, నాగభాను, పెద్దపంజాణికి చెందిన వైష్ణవిలు బహుమతులకు ఎంపికయ్యారన్నారు. చిత్రలేఖన పోటీలో హైదరాబాదుకు చెందిన సాయి జైరెడ్డి, అర్చిత, సంకీర్తి, పలమనేరుకు చెందిన ప్రణిత, డింపుల్ దీక్షారెడ్డి, శ్రీహిత, మోనిక, గంగవరంకు చెందిన ప్రకాష్ రాజ్, గిర్వాణ్, గురుచైతన్య, జశ్వంత్, పూర్ణచంద్ ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఈనెల 9వ తేదీన కళామందిరం వార్షికోత్సవం సందర్భంగా బహుమతులు అందించనున్నట్లు తెలిపారు

# పథకాల్లో మంజూరైన పనులు పూర్తిచేయాలి

**ప్రజాశక్తి- నగరి :** నాడు- నేడు, గడపగడపకు, జలజీవన్ మిషన్ పథకంలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అండ్‌ఎస్ ఎస్‌ఈ కె.శంకర్‌బాబు అన్నారు. గురువారం స్థానిక గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య కార్యాయంలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన ఏఈలు, డీఈఈతో ఆయన సమావేశమయ్యారు. మండలాల్లో చేపడుతున్న పనులపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరవుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. జలజీవన్ మిషన్‌లో మంజూరైన రక్షిత నీటిసరఫరా పనులను పరిశీలించారు. ప్రతిఇంటి ఆవరణలో తాగునీటి కొళాయి ఏర్పాటు చేయాలన్నారు. జరిగిన పనులకు వెంటనే చెల్లింపులు ఉంటాయన్నారు. నాడు- నేడు పనుల ఎటువంటి నాణ్యత లోపం లేకుండా సకాలంలో పూర్తిచేయాలన్నారు. డీఈఈ ఎంఆర్ సతీష్‌కుమార్, ఏఈలు ఆర్.శైలేంద్ర, శ్రీకాంత్, అంజేరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ జూనోసిస్ డే


**ప్రజాశక్తి-క్యాంపస్:** అంతర్జాతీయ జూనోసిస్ డే సందర్భంగా వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో తిరుపతిలోని స్థానిక తాతయ్యగుంట పశు వైద్య చికిత్స సముదాయంలో ఉచిత యాంటీ రాబిస్ టీకా క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య కళాశాల డీన్ డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవ రోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఇక్కడ ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో స్థానిక ప్రజలు, పశు యజమానులు, జంతువులకు సంబంధించిన వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స చేసుకోవడం జరుగుతుందన్నారు. పశు వైద్య కళాశాల అసోసియేట్ ఇన్ డాక్టర్ ఆదిలక్ష్మమ్మ మాట్లాడుతూ ఈ ఉచిత మెడికల్ క్యాంపులో యాంటీ రేబిస్ టీకాలను 250 శునకలకు అందించినట్లు వెల్లడించారు. జూనోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విభాగాధిపతి, అధ్యాపకులు, పీజీ, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాశక్తి- నగరి:** ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కొరకు అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారులు డాక్టర్ కెవి. ఆదినటేష్, డాక్టర్ షేక్ యాస్మిన్ అన్నారు. గురువారం మండలంలోని బుగ్గఅగ్రహారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని దామరపాకం సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వారు తనిఖీ చేశారు. ప్రజలకు అందించు వైద్యసేవలు, గహ సందర్శనలపై ఆరాతీశారు. వైద్యసేవల నిర్వహణపై సంతప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీపీ, షుగర్, గర్భవతులు, బాలింతలకు సచివాలయాల వద్దే అందుతున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సుబ్రమణ్యం, జనార్ధన్, ఆషాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

## 'రెవెన్యూ భూఆక్రమణలను ఆపండి'



**ప్రజాశక్తి- యాదమరి:** ఓటేరిపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 88లో కొంతమంది రెవెన్యూ భూములను ఆక్రమించుకుంటున్నారని వారిపై చర్య తీసుకోవాలని ఓటేరిపల్లి గ్రామస్తులు కోరారు. ప్రజాప్రయోజనాల కోసం గతంలో తహశీల్దార్ బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు అలాగే గ్రామంలో ప్రజలు తాగునీటి సౌకర్యార్థం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఆ ప్రదేశాన్ని ఎంపిక చేశారని అయితే ఆ భూముల్లో ప్రస్తుతం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రోడ్డు గ్రామమానుకొని ఉన్న భూములను ఆక్రములకు పాల్పడుతుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడే రోడ్డు సమీపంలోని రెవెన్యూ భూములను ఆక్రమణలకు గురి కాకుండా వారిపై చర్య తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 7న వాహనాలు వేలం

**ప్రజాశక్తి- నగరి:** ఎక్సైజ్ శాఖ దాడుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సిఐ వర్ధనాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిఎస్టీ రిజిస్ట్రేషను కలిగిన వారు ఈ వేలం పాటల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు స్థానిక ఎస్ఈబి కార్యాలయంలోని అధికారులను సంప్రదించాలని సూచించారు.

## ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలి



**ప్రజాశక్తి-గూడూరు:** సంచార జాతుల ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని తోలుబొమ్మలాట కుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సంచారజాతుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి సంచార జాతులను బీసీ-బీలో కలుపుతూ జీవో జారీ చేసి ప్రభుత్వ పథకాలు అందేలా కషి చేసిన మహానుభావుడన్నారు. ఈ నెల 18న ఉమ్మడి నెల్లూరు జిల్లా లోని అంబేద్కర్ భవన్ లో జరిగే సంచార జాతుల సభకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సంచార జాతుల మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, పెద్దలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బాలకష్ణ వేడుక సంచార జాతుల జాతీయ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వంలో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తోలు బొమ్మలాట కుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు బిందే శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి వనపర్తి రమేష్, గౌరవ సలహాదారు సిందే చిన కొండయ్య, గూడూరు డివిజన్ నాయకులు బాబు, వెంకటేశ్వర్లు, సిందే వెంకటేశ్వర్లు, సిందే వెంకయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే సృజనాత్మకంగా బోధన

**ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:** తరగతి గదిలో విద్యార్థులకు సజనాత్మకంగా బోధన చేస్తూ మాతభాష తెలుగుపై మక్కువ, అభిరుచిని కలిగించేలా బోధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి-2 మునిసుబ్రమణ్యం అన్నారు. గురువారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో తెలుగు ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు భాషపై పట్టు కలిగిస్తూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యబోధన చేయాలన్నారు.

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: PUTTUR**
**I.A.No. 14,15,16 / 2022**
**A.S.No. 51 / 2019,**
**O.S. No. 128 / 2007**

BETWEEN:-
M. Dasaradan and others .......Appellants
And:-
A. Munaiah (Died) and others ......Respondents

**NOTICE TO THE RESPONDENTS NO. 2,4,5,8**

To
R2- A. Muthamma,
W/o Late A. Munaiah,
R4- A. Munirathnam,
S/o Late A. Munaiah,
R5- A. Ramesh,
S/o Late A. Munaiah,
R8- A. M. Ravi, S/o Late A. Munaiah,
All are residing at N.R.Puram H/W Colony
N.R.Puram Post, S.R. Puram Mandal,
Chittoor District, A.P.,

Please take notice that the above case is posted for your appearance on 08-08-2023 before the Senior Civil Judge Court, Puttur at 10.30 A.M. Failure to appear on the said date by you, the matter will be decided on exparte.

By order of court
**SRI. M. MOHAN RAJU, M.A., LLB.,**
**ADVOCATE FOR PETITIONERS/ APPELLANTS , TIRUPATI.**